# ఆమె చెయ్యని నేరం

(కథానిక)

నాకు ఆడవాళ్ళంటే ఎంత గిట్టకపోయినా, ఆడవాళ్లను చూస్తే నాకెంతో అసహ్యమూ, భయమూ అయినాకూడా, ఆమెను చూడగానే నాకు జాలివేసింది. జాలిపడక తప్పింది కాదు. అంతమాత్రానికే అది ప్రేమా కాదు, అనురాగమూ కాదు ఆమెను నాతో తీసుకురావటానికి ప్రయత్నించాను. కాని వీలులేకపోయింది. తీసుకురావాలనుకున్నాను గాబట్టి ప్రేమించానవటం గాని, ప్రేమించాననుకోవటంగాని పొరబాటు. ప్రేమలేకుండా, ఒక స్త్రీకి పురుషుడికీ మధ్య స్నేహం అసంభవమనే చాలమంది అభిప్రాయం. ఆమె విషయంలో మాత్రం అది సంభవమనిపించింది.

నా జీవితంలో నేనెన్నడూ ఏ స్త్రీనీ చూసి దయతలచలేదు, బాధపడలేదు ఆమె తప్ప. నా గతజీవితంలో నేనెన్నడూ ఏ స్త్రీనీ ప్రేమించలేదు. ఏ స్త్రీని కూడ ప్రేమిస్తానని గాని, ప్రేమించగలనని గాని నేననుకోను. అసలు 'ప్రేమ' అనేది లేదని నా విశ్వాసం. మానవుడిలో కలిగే తదితర భావాలకి ఆ పేరు పెడతారు.

ఆమెను నేను మొట్టమొదటిసారిగా అండమాను ద్వీపాలలో కలుసుకొన్నాను. ఒక నాటి సాయంకాలం నేను ఒక ప్రాంతంలో తిరుగుతున్నాను. ఆప్రాంతం పేరు సరిగ్గా జ్ఞాపకం లేదు. ఆమె ఆరోజు ఎక్కడో పనిచేసి తనుండే చోటికి పోతున్నది. దారిలో ఆమెను చూశాను. ఆశ్చర్యపోయాను. ఎక్కడో చూసినట్లు జ్ఞాపకం. కొద్దిదూరం ఆమెవెంట పోయాను ఆమెను పలకరించాలని, నా ఉద్దేశ్యం. ధైర్యం లేదు. ఆమె కూలిమనిషని అనుకోలేదు, మనిషి అలా లేదు కనుక. అందుచేతనే మాట్లాడించలేకపోయాను. రెండు మూడు ఫర్లాంగులు పోయాను ఆమెవెనకనే.

నేను ఆమెవంక చూడటం, వెంబడించి రావటం ఆమె గమనించి ఆగింది. నేను పోతూనేఉన్నాను. నేను దగ్గరకు రాగానే ఆమెకూడా నడక సాగించింది.

ఆనాటి సాయంకాలం నాకు ఈనాటికీ గుర్తున్నది. సూర్యరశ్మి భూమిమీద పడటం లేదు. మేఘాలు దట్టంగా అలుముకొనిఉన్నయ్. చల్లగా ఉన్నది. గాలివీస్తోంది. వాన వచ్చే సూచనలు మాత్రం కనిపించలేదు అంత చల్లగా ఉన్నాకూడా.

ఇద్దరం కలసి రెండడుగులు ముందుకువేశాం. నేనే పలకరిద్దామని అనుకుంటున్నాను. ఇంతలోనే ఆమే పలకరించింది.

"నన్ను ఎక్కడో చూసిన జ్ఞాపకం మీకు ఉన్నదనుకుంటాను."

"లేదు" అన్నాను.

"నాకేసి తీక్షణంగా చూస్తూంటే అలాగని అనుకున్నా. క్షమించండి."

"ఆ...ఫరవాలేదు. నన్నెక్కడైనా చూసినట్లు జ్ఞాపకమా?" అని అడిగాను.

"లేదు" అన్నది క్లుప్తంగా.

అంటూనే వడిగా ముందుకు సాగిపోబోయింది.

"మీరు తెలుగువారేనా?" అన్నాను ఆమెను ఆపుతూ.

ఔనన్నట్లు తల ఊపింది.

"ఇక్కడికెందుకువచ్చారు?" అన్నాను.

మాట్లాడలేదు.

"చూసి పోవటాని కనుకుంటాను. నేను కూడ అందుకే వచ్చాను." అన్నాను.

"మీరు అందుకే వచ్చి ఉంటారనుకొన్నాను మిమ్మల్ని చూడగానే. నేను మాత్రం

"అమరశ్రీ"

అందుకు రాలేదు.'' అన్నదామె మరోవైపుకు తిరుగుతూ.

“మరి కారణం?'' అన్నాను.

ఆమె మాట్లాడలేదు. మరోవైపుకుతిరిగి తల క్రిందికి దించి నేలకేసి చూస్తూ నడుస్తోంది. మాట్లాడుకోకుండానే నాలుగడుగులు వేశాము. ఆమె పమిట చెంగుతో కళ్ళు తుడుచుకోబోయింది. అప్పుడు తల ఎత్తినపుడు ఆమె ముఖంలోకి చూశాను. కళ్లనిండా నీళ్ళు తిరిగి ఉన్నయ్.

నేనామె కళ్ళలోకి చూడగానే ఆమె దుఃఖం ఆపుకోలేక, పమిటచెంగు ముఖానికి అడ్డం పెట్టుకొని అక్కడే కూలబడిపోయింది. నాకేం చేయాలో అర్థమయింది కాదు. నేను కూడ ఆమెతో పాటుగా కూర్చున్నాను. ఆమెతో మాట్లాడి ఓదార్చాలనుకున్నాను. కాని కొత్తగా పరిచయమయిన వ్యక్తిదగ్గర ఆ మాత్రం చనువు తీసుకొనే సాహసం లేక పోయింది.

కొంచెంసేపయిన తరువాత ఆమె ముఖం ఎత్తింది. ఆ వ్యవధిలో నేను అర్థం చేసుకో గలిగాను, కొంతవరకు ఆమె స్థితిని. ఆమె కూడా తల ఎత్తి చుట్టూరా చూసింది. ఒక్కసారి మళ్ళా నా ముఖంలోకి చూడబోయింది. నేను ఊరికే కూర్చోలేకపోయాను.

“మీరేదో సందేహిస్తున్నారల్లే ఉంది'' అన్నాను.

“లేదు'' అన్నది.

“ఏవో పాత విషయాలు జ్ఞాపకం వచ్చినట్లున్నయ్'' అన్నాను మళ్ళా.

ఆమె తల ఊపింది. దాని అర్థం నాకు బోధపడలేదు. కాస్సేపు నిశ్శబ్దంగానే కూర్చున్నాం.

“మీరుండేది ఎక్కడ?'' అన్నాను.

“మరో మైలు పోవాలి'' అన్నది.

“నేనుకూడ ఆ ప్రాంతాల్లోనే ఉంటున్నాను.''

“మీరు తెలుగువారేనా?'' అడిగిందామె.

తల ఊపుతూ లేచి నిలబడ్డాను.

“నడవలేరా?'' అన్నాను.

“నడవలేకపోతే ఎలా? తప్పుతుందా? అయినా, ఆ గతి ఇంకాపట్టలేదు. నడవగలను'' అంటూ లేచి నడవసాగింది.

ఆ నిముషంనుంచి ఆమెనుగురించి తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. ఆమెతో నడుస్తూనే మాటలు ప్రారంభించాను.

“మీ రిక్కడికెందుకు వచ్చారు? అన్నాను సందేహిస్తూనే.

“నేరం'' అన్నదామె పళ్లు బిగించి కళ్లు చిట్లిస్తూ.

నే నేమీ మాట్లాడలేదు కాస్సేపు.

“అవును, నేరం. అవును. నేరం చేశాను'' అన్నదామె.

ఆమాటలు వినగానే నేనొక్కసారి ఉలిక్కిపడి ఆమె వైపు తిరిగిచూశాను. ఆమె ఆకారం మారిపోయింది. నేనంతకుముందు చూసిన మృదుత్వం లేదు ఇప్పుడామెలో. ఆమె కళ్ళు అదోరకపు ఎర్రదనాన్ని తెచ్చిపెట్టుకున్నయ్. కనుబొమలు వంకర తిరిగిపోయినయ్.

“ఏం నేరం?'' అన్నాను.

“ప్రతిపనీ నేరమే.''

“ఎలా?''

“దొంగదృష్టిలో దొర చేసినపని నేరం. దొరదృష్టిలో దొంగ చేసినపని నేరం. అలాగే ఒకడు చేసినపని మరొకడి దృష్టిలో నేరం.''

“మీమీద ఆరోపించబడిన నేరం?'' అడిగాను నేను.

“చాలా గొప్ప నేరం, గొప్ప సాత్యం. ప్రకృతిసిద్ధంగా జరిగినపనికి ఫలితం నాకు శిక్ష.''

“అసలు విషయం ఏమిటి?'' అన్నాను ఆదుర్దాగా. ఆమె ప్రారంభించింది. మేముమాత్రం నడుస్తూనే ఉన్నాం.

“నేను చేసినపని నేరమో కాదో నాకు తెలియదు. అయినా చెప్తాను. నాకీశిక్షపడిన కొత్తరోజుల్లో నేను చేసింది నేరమనుకొనే దానినికాదు. కాని నన్ను ఈ అండమాను ద్వీపానికి పంపివేసిన తరువాత, కొన్నాళ్లు ఇక్కడ ఉన్న తరువాత నిజంగా సందేహం వచ్చింది నాకు, నేను చేసింది నేరం అవునా? కాదా? అని.

“ఆరోజురాత్రి నాకు చాలబాగా జ్ఞాపకం ఉన్నది. అది మండువేసవికాలం. 1923వ

సంవత్సరంలో జరిగిన విషయం. ఆనాటి సాయంకాలం నాభర్త ఆఫీసునుంచి తిరిగి వచ్చాడు ఓ టెలిగ్రాం చేతబట్టుకొని.”

“ఏమిటది?” అన్నాను.

“చేతికిచ్చాడు. చదువుకొన్నాను. నేను కూడా బి. ఏ. ప్యాసయినాను గాబట్టి చదువుకొన్నాను ఆ టెలిగ్రాం.

“అది నాభర్తకు అత్యంత సన్నిహితుడైన ఒక స్నేహితుడిదగ్గరనుంచి వచ్చింది. అర్జంటుగా బయలుదేరి రావలసిందని వ్రాసి ఉన్నది.

“ఆయనేమీ మాట్లాడలేదు. నేను కూడా మాట్లాడలేదు. అటువంటి విషయాల్ని గురించి మాకు మాట్లాడుకోవలసిన అవసరమే ఉండేది కాదు. ఆయన ఇష్టమే నా ఇష్టం, నా ఇష్టమే ఆయన ఇష్టం కనుక.

“కావలసిన సామానంతా సర్దుకొన్నాం. రాత్రి తొమ్మిదిగంటల బండికి పోవాలని మా ఉద్దేశ్యం. ఆరాత్రి ఆ ఊరి స్టేషనులో బండి ఎక్కాం. రాత్రి ఒంటిగంటకు మేము ఒక స్టేషన్లో దిగవలసి వచ్చింది. అక్కడ బండి మారాలి. ఆచీకట్లో అర్ధరాత్రి దిగాం. నా మురళి అప్పటికి నాలుగేళ్లవాడు. ఆయన, నేనూ, పిల్లవాడూ సామానుతోపాటు అక్కడ దిగాం.

స్టేషను ప్లాటుఫారం ఒక చివరకు చేరవేయించాం సామాను. మేము ఎక్కవలసిన బండి తెల్లవారిన తరువాతగాని రాదు. అందుచేత చేసేదిలేక అక్కడ కూర్చున్నాం. అక్కడ పక్కపరుచుకొని పండుకోవటానికి వీల్లేదు. అలాగే కూర్చున్నాం మాట్లాడుకుంటూ. పిల్లవాడుకూడ మేలుకొనే ఉన్నాడు.

“ఏమీ తోచటంలేదు ప్రసన్నా” అన్నాడు.

“ఏం చెయ్యమంటారు” అన్నాను.

“సరే. సిగరెట్ కాల్చుకొంటా పోనీ” అని సిగరెట్ కేస్ తీశాడు.

సిగరెట్లు లేవు. ఆ ‘కేస్’లో సిగరెట్లు ఉంటే ఒకవేళ నాకా గతి పట్టి ఉండేది కాదేమో!

“అవికూడ ఇప్పుడే అయిపోయినయ్. ఏదైనా షాపు తీసిఉన్నదో లేదో.”

“మీకోసమని తెరిచి ఉంచుతారు” అన్నాను మామూలుగా.

“అయినా పోయి, ఉంటే కొనుక్కువస్తాను” అంటూ లేచాడు.

“లేచి సూటువిప్పి లుంగీ కట్టుకొని బయలుదేరాడు. ఆ విప్పిన సూటు పెట్టెమీద పెట్టాడు. అప్పుడు బద్ధకంగా పెట్టె తీయలేక దానిమీదే ఉంచాను ఆ సూటు.

“అబ్బాయీ నేనూపోతాం. ఏం నాన్నా!” అన్నాడు నా వొళ్ళో ఉన్న మురళిని తీసుకోబోతూ.

“అబ్బాయెందుకు?” అన్నాను.

“తోడుగా ఉంటాడు.” అన్నారాయన నవ్వుతూ.

“మరి నా విషయం? నేనొక్కదాన్నే ఇక్కడ కూర్చోవటం ఎలా?”

“సరే వాడిష్టం. నాన్నా నేను పోతున్నా. చాకిలెట్ కొనిపెడతా వెంటవస్తే” అన్నాడు మురళితో పోతూపోతూ ఆయన.

“నేను రానన్నట్లు తల ఊపాడు మురళి. ఆయన కనుచూపు మేరదాటేవరకు చూస్తూనే ఉన్నాను. పది నిముషాలు చూశాను. తిరిగి రాలేదు. నాకు తోచక లేచినిలబడ్డాను. పిల్లవాడికి నిద్రవస్తోంది కాబోలు నేను విడిచిపెట్టి లేవగానే ఏడుపు మొదలుపెట్టాడు. ఎంత సముదాయించినా ఊరుకునే విధం కనుపించ లేదు.

“చివరికి ఓ ఆలోచన తట్టింది. ఆ పెట్టెమీద ఉన్న సూటు తీసి నేను వేసుకోవటం ప్రారంభించాను. ఇదంతా చూస్తు వాడు ఏడుపు మానేశాడు. నేను సూటు వేసుకొని అక్కడున్న ‘పే[illegible]’ పెట్టుకొని వాడిని ఆడిస్తున్నాను. వాడు నన్ను చూసి నవ్వుతూ కేరింతాలు కొడుతున్నాడు.

“చాలసేపయింది. అప్పటికీ రాలేదాయన. గడియారంవంక చూశాను. అరగంట దాటిపోయింది. చుట్టూరా చూశాను. వెన్నెల క్రమంగా తగ్గిపోతోంది. చీకటి. భయం పుట్టసాగింది. నేనొక్కతెనే ఉన్నాను ప్లాటుఫారం చివర.

"వస్తారన్న ఆశతో అలా గేటూర్పే బెట్టి ఆడిస్తున్నాను. ఇంతలో పెద్ద పెద్ద కేకలు వినిపించినయ్. నా వెనుకనుంచి వస్తున్నట్టు తోచింది. వెనక్కు తిరిగి చూచాను. ఎవరో పరుగెత్తుతున్నారు రైలు పట్టాల వైపు. కొన్నైపు ప్రాణాలు బిగబట్టుకొని అలాగే కూర్చున్నాను.

"ఇంతలో ఆ జనం అంతా నేనున్న వైపే కదిలిరావటం ప్రారంభించారు. నా మనస్సులో ఏదో పీకుతూనే ఉంది. గంట క్రింతం పోయిన ఆయన రాకపోవటంవల్ల నామనస్సు సరిగా లేదు. నన్నెవరూ ఓదార్చే వాళ్ళు లేరు గాబట్టి, నన్ను నేనే సమాధాన పరచుకొని వాడిని కూడ ఓదార్చే ప్రయత్నంలో ఉన్నాను.

"ఆ మనుషులందరూ ఇంతలో ప్లాటుఫారానికి దగ్గరగా వచ్చారు.

"ఏమిటి?" అనడిగాను.

"ఎవరో ఒక మనిషి గూడ్సు బండి క్రింద పడిచనిపోయాడు." అన్నాడు ఆ మోసు కెళ్తున్న శవాన్ని చూపిస్తూ వారిలో ఒకడు. అప్పటికి నేను నూటు వేసుకొనే ఉన్నాను. ఆ మనిషి నన్ను చూసి ఏమనుకున్నాడో నాకు మాత్రం తెలియదు.

"దగ్గరకుపోయి శవం వంక చూద్దామని చూశాను. ఆ గుడ్డి వెలుతురులో కూడ గుర్తుపట్టగలిగాను. నా గుండె పగిలి పోయింది. ఏంచేయాలో తోచిందికాదు. ఆయన శవం అది. రైలు క్రింద పడ్డాడు. ఏంజరిగిందో తెలియలేదు. ఏంజరగబోతోందో కూడా తెలియలేదు.

"ఒక్కసారి పెద్దపెట్టున నెత్తినోరూ బాదుకుంటూ ఏడ్చాను. చంకలో పిల్లవాడికికూడ భయంపుట్టి ఏడుపు ప్రారంభించాడు. ఏడుస్తూ, పోలీసు స్టేషనుకు చేరాను శవంతో బాటు.

"నేను నూటు వేసుకొని ఉన్నానన్న విషయమే మర్చిపోయాను. సబ్ ఇన్‌స్పెక్టరు వాళ్ళందరూ నన్ను చూసి ఆశ్చర్యపోయారు. ఆయన జేబులో ఉన్న వస్తువులన్నీ బయటకు తీశారు. సిగరెట్‌తో నిండిన సిగరెట్ కేసు, ఒక జేబురుమాలు, మనీపర్సు ఉన్నయ్.

"అప్పుడర్థమయింది నాకు. సిగరెట్లు స్టేషన్లో దొరకకపోతే ఊళ్ళోకి పోయి, స్టేషను వెనుకగుండా వస్తూంటే గూడ్సుకింద పడ్డాడని ఊహించుకున్నాను.

"పోలీసు స్టేషనులో చెప్పాను; జరిగిన విషయమంతా. అంతా వ్రాసుకున్నారు. నా అడ్రసు కూడ వ్రాసుకున్నారు. ప్రమాదం జరిగే సమయానికి నేను నూటులో ఉన్నానని కూడ వ్రాసుకొన్నారు.

"నేనిచ్చిన టెలిగ్రాం అందుకొని, మేము ఎవరికోసం పోతున్నామో ఆయన వచ్చి, పెళ్ళి కూడ ఆపుకొని నన్ను ఇంటివద్దగ దిగవిడిచాడు.

"నాకు తల్లిదండ్రులు లేరు. మరే బంధువులూ లేరు. అందుచేత ఆ ఇంట్లోనే ఉన్నాను కొన్నాళ్లు. ఇంతలో పోలీసువాళ్ళ సాక్ష్యంతో నాభర్తతరపుబంధువులు నామీద కేసుపెట్టారు. నేను సందేహించవలసిన స్త్రీననీ, భర్తను నా అంతట నేను గూడ్సు బండిక్రింద పడేలా చేశాననీ, వాళ్ల ఛార్జిషీటు. ఆవిధంగా చంపి పారిపోవటంకోసం నేను నూటువేసుకొని ఆ ప్రయత్నంలో ఉండగా ఆ మనుషులు నన్ను సవిూపించారనీ లేకపోతే నేను పారిపోయేదాన్ననీ వాదించారు.

"అసలు నేనంటే వాళ్ళందరకూ తీరనికోపం. నాభర్త నన్ను పెళ్ళిచేసుకోవటం ఆయన తల్లిదండ్రులకు గాని, తదితర బంధువులకు గాని ఇష్టంలేదు. ఏమీలేనిదానిని, కులం తక్కువదానిని పెళ్ళిచేసుకున్నందుకు కోపం ఆయన మీద. నేనంటే వాళ్లకి ద్వేషం, అసహ్యమూను.




"నన్ను కోర్టులో విచారించారు. ఆరోజు కూడా నాకు బాగా జ్ఞాపకం. వాళ్ళతరఫున ఇద్దరు ప్లీడర్లు వాదించారు. నాతరఫున ఎవరూ వాదించలేదు. వాదింపజేసేవాళ్ళు లేరు నాకు. నావిషయం నేనే చెప్పుకున్నాను, స్వయంగా కోర్టులో. ఆనాటిదృశ్యం నాకు ఈనాటికీ కళ్లకుకట్టినట్లుగానే ఉన్నది. ఆరోజు నా జీవితాన్ని మార్చేసింది. ఆరోజు ఎలా మరిచిపోగలుగుతాను. నాజీవితాన్ని మార్చి, మాడ్చి నన్ను నాశనంచేసిన ఆ దినాన్ని ఎలా మరుస్తాను?

"నేరం చెయ్యకపోతే ప్లీడరు నెందుకు పెట్టుకోలేదు" అన్నారు కొందరు. మరికొందరు మరికొన్ని అన్నారు. బయట ఆ జనంలో నిలబడి ఈ మాటలన్నీ స్వయంగా నేను విన్నాను. నన్ను కోర్టులోకి పిలిచేవరకూ బయటనే నిలబడి ఉన్నాను. బయట నిలబడి ఉన్నంతసేపూ నేనా మాటలు వింటూనే ఉన్నాను.

"ఆరోజు నాకీశిక్ష విధించారు. మొట్టమొదట చాలా బాధపడ్డాను. ఉరిశిక్షవేసినా బాగుండు ననుకొన్నాను. కాని నామీద ఆమాత్రం జాలి కూడా పుట్టలేదు ఆ జడ్జికి.

"1934వ సంవత్సరంలో నన్నిక్కడకు తీసుకు వచ్చారు. వచ్చినకొత్తరోజుల్లో ఎంతో బాధగా ఉండేది. వెనుకటి విషయాలే గుర్తుకు వచ్చేవి. పనిచేయ బుద్ధయేదికాదు. రెక్క ఆడకపోతే డొక్క కూడా ఆడని పరిస్థితికాబట్టి నెమ్మది మీద పనిచేయటానికి అలవాటు పడ్డాను." అంటూ మళ్ళా పమిటచెంగుతో ముఖం కప్పుకొని ఏడ్చింది.

నిజానికి నాకు ఆమెను ఓదార్చటం చేతకాలేదు. కాని ఆమెను చూస్తూంటే నాకు కూడా ఏడుపు వచ్చిందారోజు. కాని ఏం చేస్తాను.

"ఆపిల్లవాడి విషయం?" అన్నాను.

"నా మురళిని తీసుకుపోయారు. నా మామగారు తీసుకున్నారు. వాడికేం చేంశారో" అన్నదామె.

అంటూనే తల దించేసుకొని కళ్ళ నీరు తుడుచుకొన్నది. తరువాత నేకూడా ఆమెతో పాటు ఆమె గుడిసె జేరుకున్నాను. ఆ రోజు ఆమె నాకక్కడ భోజనం పెట్టింది. అండమాను దీవులలో ఉండే ఆమెకంత చరిత్ర కలదని అనుకోలేదు. మరునాడు నేనుండేచోటుకు పోయాను.

నేనక్కడ ఉన్నన్నాళ్లు, ఆమె దగ్గరకు పోతుండేవాడిని రోజూ. ప్రతి రోజూ ఆమె గుడిసెలో ఓగంట గడిపేవాడిని. వయస్సు మీరినా అప్పటికే ఆమె అందంగా కనిపించింది. ఒకప్పుడంతకంటె అందంగా ఉండేదని స్పష్టమవుతుంది, ఆమెను చూసిన ప్రతి వ్యక్తికీ.

ఆమె నడిగాను, ఇంటికి రమ్మని. మొట్టమొదట రానన్నది. నేను చెప్పగా చెప్పగా, రావటానికి అంగీకరించింది చిట్ట చివరకు.

కాని లాభం లేకపోయింది. పాస్‌పోర్టు ఇవ్వలేదు. ఎంతో ప్రయత్నించాను. పాస్‌పోర్టు దొరకలేదు. నా ప్రయత్నాలన్నీ నాశనమయినయ్.

నేను స్టీమరు ఎక్కే సమయంలో ఆమె హార్బరుకు వచ్చింది. నేను స్టీమరు ఎక్కాను. ఆమె కళ్లవెంట రెండు అశ్రుబిందువులు రాలినయ్. దూరాన వున్నా నాకామె స్థితి అవగాహన అయింది. ఆమెను విడిచిపెట్టి వచ్చే సమయంలో నేను చాలా బాధపడ్డాను. నేను స్టీమరు ఎక్కబోయే ముందు తన కొడుకు మురళి విషయం ప్రస్తావించింది ఆమె నాతో. నేను చూస్తూనే ఉన్నాను, హార్బరులో నిలబడిన ఆమెవంక. నా స్టీమరు కదలిపోయింది. నేను కనుపించినంత సేపూ కదలకుండా ఆమె చూస్తూనే ఉన్నది.

నేను ఇంటికి తిరిగివచ్చాను. ఆమె చెప్పిన ఊరికిపోయికనుక్కున్నాను. తెలిసినయ్, అన్ని విషయాలూ, ఆమె చేసిన నేరం ఏమిటి? అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. సమాధానం లేదు.

ఆమె కొడుకు మురళి జిల్లా కలెక్టరు అని తెలియగానే పరమానందభరితుడి నయ్యాను. ఆమెకు తెలిస్తే? ఆమెకు తెలిసే విధం ఏది? ఆలోచిస్తున్నాను.